క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



వాహన పత్రాన్ని పరిశీలిస్తున్న సీఐ ఆదిప్రసాద్

ఏలూరు టౌన్: రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ అన్నారు. బుధవారం సాయంత్రం ఏలూరు వన్‌టౌన్ పాండురంగ థియేటర్ తదితర ప్రాంతాల్లో వాహనతనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాలకు రిజిస్ట్రేషన్, పొల్యూషన్, బీమా ఉన్నాయా లేదా అనేది ఆరా తీశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు చలానాలు విధించారు. వన్‌టౌన్ ఎస్సై బాషా, సిబ్బంది ఉన్నారు.

చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స



బాలుడ్ని పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి, బెన్నీ తదితరులు

ఏలూరు టౌన్: తలసేమియా చిన్నారులకు అండగా ఉండాలని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి కోరారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం సుమారు 11 మంది చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందించారు. వీరిని రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి, కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కే వరప్రసాదరావు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. తలసేమియా చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు, సహాయకులకు 30 మందికి ఏలూరు మానవత వైస్ ప్రెసిడెంట్ మానేపల్లి సునీత, సత్యనారాయణ దంపతులు భోజన సదుపాయం కల్పించారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

దెందులూరు : ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య రైస్ మిల్లు యజమానులకు సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్ దింపుకోవాలని, అవసరమైతే ఎక్కువ హమాలీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారినుంచి ఎటు వంటి డబ్బులు వసూలు చేయరాదని, ధాన్యం దింపుకోకపోయినా, దింపుకునే ప్రక్రియలో డబ్బులు వసూలుచేసినా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటుందని చెప్పారు.

ప్రభుత్వ బడుల్లో విద్యా వికాసం

- బడులు తెరిచిన రోజే విద్యాకానుక పంపిణీకి చర్యలు
- తొలి విడతలో పంపిణీకి 65,200 పాఠ్యపుస్తకాలు
- ఏలూరు రూరల్, అర్బన్ కలిపి 18,117 మంది విద్యార్థులు



నగరానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పెచ్చులూడిపోయిన బిల్డింగ్ శ్లాబులు.. ఎప్పుడు కూలి మీద పడతాయో అనే భయాందోళన.. తాగడానికి మంచినీటి సౌకర్యం కరువు.. ప్రభుత్వ బడులవైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి.. ఇదంతా గతం. నాటి పరిస్థితికి పూర్తి భిన్నంగా గత నాలుగేళ్లుగా ప్రభుత్వ బడుల స్వరూపమే పూర్తిగా మారిపోతూ వస్తోంది. బడులే కాదు విద్యార్థుల్లోనూ విశేషమైన మార్పు వచ్చింది. ప్రభుత్వ విద్యారంగం ప్రగతివైపు పరుగులు తీస్తోంది. గతంలో ప్రైవేట్ పాఠశాలలవైపు చూసే విద్యార్థులంతా జగనన్న అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు, సౌకర్యాలు, బడుల అభివృద్ధిని చూసి ప్రభుత్వ బడులవైపు పరుగులు తీస్తున్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలను మించి సదుపాయాలు కల్పించారు. బడులు తెరిచే నాటికి విద్యాకానుక విద్యార్థులకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యాకానుక ఇలా..

జగనన్న విద్యాకానుక కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మూడు జతల యూనిఫారం, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్ అందిస్తోంది. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, రెండు జతల సాక్స్, ఒక జత బూట్లు, ఒక బెల్టు, ఒక స్కూల్ బ్యాగ్, 1 నుంచి 6వ తరగతి వరకు విద్యార్థులకు బొమ్మల డిక్షనరీలు 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందిస్తుంది. ఏటా కొత్త స్కూల్ బ్యాగ్, కొత్త బూట్లు, కొత్త బెల్టు.. ఇలాంటి సౌకర్యం బహుశా డబ్బులి చెల్లించినా కార్పొరేట్ విద్యార్థులకు కూడా అందకపోవచ్చు.

తొలి విడతలో పాఠ్యపుస్తకాలు సిద్ధం

2023–24 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు ఇచ్చే విద్యాకానుకలో భాగంగా తొలి విడతలో ఏలూరు అర్బన్, రూరల్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు 65,200 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. వీటిని విద్యాశాఖ అధికారులు స్టాక్‌పాయింట్‌కు చేర్చారు. ఈ నెలాఖరు నాటికి మరిన్ని విద్యాకానుక వస్తువులు రానున్నాయని అధికారులు చెబుతున్నారు.

ఏలూరు నియోజకవర్గంలో 18,117 మంది విద్యార్థులు

ఏలూరు నియోజకవర్గంలో అర్బన్ పరిధిలో 65 పాఠశాలలు, రూరల్ పరిధిలో 56 పాఠశాలలు వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఏలూరు అర్బన్ పరిధిలో 10,437 మంది విద్యార్థులు, రూరల్ పరిధిలో 7,680 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి జగనన్న విద్యాకానుకగా మొత్తం 2,06,411 నోట్ పుస్తకాలు, 18117 స్కూల్ బ్యాగులు, 18,117 జతల బూట్లు, 14,671 బెల్టులు, 19,7821 పాఠ్యపుస్తకాలు, 18,117 మందికి మూడేసి జతల చొప్పున యూనిఫారం అందించేందుకు ఏర్పాట్లు చకచకా చేసేస్తున్నారు.

గ్జేవియర్ స్కూల్‌లో స్టాక్ పాయింట్



ఏలూరు నియోజకవర్గానికి సంబంధించి జగనన్న విద్యాకానుక కిట్లను భద్రపరచడానికి నగరంలోని సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశాం. ఈ పాఠశాలలో నాలుగు గదులను సిద్ధం చేశాం. ప్రస్తుతం వచ్చిన పాఠ్యపుస్తకాలను ఇక్కడే భద్రపరిచాం. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు ఇక్కడి నుంచే కిట్లను సరఫరా చేస్తాం. బడి తెరిచే రోజునే విద్యార్థులకు కిట్లు అందించేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉన్నాం.

– సబ్బితి నరసింహమూర్తి, ఎంఈఓ, ఏలూరు

నేడు ప్రత్తికోళ్లలంకలో ఎమ్మెల్యే కొఠారు పర్యటన

ఏలూరు రూరల్: ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక గ్రామంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గురువారం ఉదయం 10 గంటలకు గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించనున్న ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు తెలిపారు. రెవెన్యూ అధికారులతో పాటు ఫారెస్ట్, ఫిషరీస్, పోలీసు అధికారులు సైతం హాజరుకానున్నట్లు చెప్పారు.

జూట్‌మిల్లు యాజమాన్యంపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జూట్ మిల్లు కార్మికుల సమస్యపై తాత్సారం చేస్తోన్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఐదు కార్మిక సంఘాల నాయకులు జేసీఎల్ ఎ.రాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై జేసీఎల్ స్పందిస్తూ ఈనెల 12న ఉదయం 11 గంటలకు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు యు.వెంకటేశ్వరరావు, టీఎన్‌టీయూసీ నాయకులు కోలపల్లి ఉమాశంకర్, సీఐటీయూ నాయకులు బి.జగన్నాథరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు పులి శ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాము మృతి తీరనిలోటు

ఏలూరు (టూటౌన్): కమ్యూనిస్టు కార్యకర్త, శతాధిక వృద్ధుడు, విశాలాంధ్ర రాముగా పిలిచే టి.రామారావు మృతి సీపీఐకి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాము ఊహ తెలిసిన నాటి నుంచీ కమ్యూనిస్టు రాజకీయాల్లో మమేకమై పనిచేశారని గుర్తు చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రభాకర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పంట రుణ పరిమితి పెంపు

పెదపాడు : ప్రభుత్వం రైతులకు పంట రుణపరిమితిని రూ.4 వేలు పెంచినట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన పంటలైన వరి, శ్రీవరి, జొన్న, మొక్కజొన్న, పెసర, మినము, రాగి, కంది వంటి పలు రకాలు పంటలకు గతంలో ఉన్న పరిమితికి అదనంగా రూ.4వేలు రుణ పరిమితిని పెంచినట్లు చెప్పారు. పెదపాడు మండలం ఎస్.కొత్తపల్లి శివారు కడిమికుంట గ్రామంలోలో బుధవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీలు నిర్మించాలని, రహదారులు అభివృద్ధి చేయాలని, ఇళ్ల స్థలాలు అందించాలని కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయుడిని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, కొల్లేరు సంఘం నాయకులు ముంగర సంజీవకుమార్, సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావ రాజు సత్యన్నారాయణ, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, సర్పంచ్‌లు చేపేని రంగారావు, కొత్తూరి జీవనకుమారి, సంబంగి శ్రావణ్‌కుమార్ వైకుంఠపు ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టించే కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం

పెదవేగి : గ్రామాలలో ప్రభుత్వం నిర్మించిన షెడ్లలో తడి చెత్త, పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు అందజేయడం వల్ల పంటలలో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని ఎంపీడీఓ జి.రాజ్ మనోజ్ అన్నారు. పంచాయతీల ద్వారా ఆదాయ వనరుల పెంపు, వాటి ద్వారా ఆర్థిక లోటు భర్తీ అనే అంశంపై సచివాలయ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఏఓ ప్రియాంక, ఏపీఓ హేమలత పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో నగర అభివృద్ధి



వన్‌టౌన్ మార్కెట్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నామని, ప్రజలంతా సహకరిస్తే నగరాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. నగరంలో బుధవారం పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ఆదేశాలతో ప్రజలకు మంచి పర్యావరణం, కాలుష్య రహితంగా ఉండే నగరాన్ని ఇవ్వాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. పాతబస్టాండ్ సెంటర్‌లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో భాగంగా వాటర్ ఫౌంటేన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. శాంతినగర్ జంక్షన్ ప్రాంతం, చేపల తూము సెంటర్, ఫిష్ మార్కెట్, శనివారపుపేట అంబేడ్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఆయా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటి పరిష్కారంపై చర్చించారు. కార్పొరేషన్ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, శానిటేషన్, హెల్త్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

7న కళా ఉత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి, మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 7న వైఎంహెచ్‌ఏ హాలులో కళా ఉత్సవం ఏర్పాటు చేసినట్టు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, సీఐటీయూ, హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ వివరాలను ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సీఐటీయూ ఏలూరు నగర కార్యదర్శి వి.సాయిబాబు, హేలాపురి సింగర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రవి వెల్లడించారు. ఏడో తేదీ సాయంత్రం నాలుగు నుంచి 7 గంటల వరకు 99 మంది అల్లూరి సీతారామరాజు వేషధారులుతో అల్లూరికి నివాళులర్పించడం, ప్రజా గీతాలకు శాస్త్రీయ నృత్య నీరాజనం, కోలాట ప్రదర్శనలు, నృత్య రూపకాలు మేడే పాటల వీడియో ప్రదర్శనలతో కళా సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాకారులకు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సంవత్సర ప్రశంసా పత్రాలు, అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర పుస్తకాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ ఉత్సవంలో ఏలూరు పరిసర ప్రాంతాల ప్రజలు, కవులు, కళాకారులు, మహిళలు, బాలబాలికలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలపాటి నాగేశ్వరరావు, వీజీఎంవీఆర్ కృష్ణారావు, పి.కస్తూరిబాయి, పీడీ రత్నాకర్ రావు, వి.సురేష్, ఎస్.గంగాభవాని, జి.శారద, ఎం.లక్ష్మి, కె.లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల లీజులో ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి



డీపీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రజక జన సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రజక వృత్తిదారులకు చెరువులపై లీజు విధానంలో ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు.రజకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక డీపీఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. డీపీఓ విజయ కుమారి, డీఎల్‌పీఓ అన్నామణిని కలిసి పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ఆ వివరాలను అనంతరం స్థానిక జిల్లా సంఘ కార్యాలయంలో వెల్లడించారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో 1972లో నాటి సర్పంచ్ కాలే ప్రకాశరావు సర్వే నెంబర్ 389లో ఆరెకరాల ధర్మకుంట అనే లింగంకుంట చెరువును రజకులకు కేటాయించారన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రజకులు లీజు చెల్లిస్తున్నారని తెలిపారు. అయితే గత మూడేళ్ల క్రితం లీజు రూ.55 వేలు ఉండగా తాజాగా లీజును భారీగా పెంచేందుకు పంచాయతీ అధికారులు సన్నాహాలు చేయడం తగదన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన జీఓ నెం.499 ప్రకారం రజక వృత్తిదారుల చెరువుల లీజు ఏటా 10 శాతం దాటకుండా వేయాల్సి ఉందని గుర్తుచేశారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ ఆదేశాలు అమలు పర్చే విధంగా జిల్లా పంచాయతీ అధికారులు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా రజక జన సంఘం నాయకులు విశాల శ్రీనివాసరావు, కోటి చుక్కల నాగేశ్వరరావు, అట్రగడ్డ ప్రభాకరరావు, ఎ.శ్రీరాములు, వేల్పూరు రాజు, బయ్యన్నగూడెం లక్ష్మీప్రసన్న, కడెళ్లి సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలంటూ రాస్తారోకో



వసంత మహల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న వామపక్షాలు, కార్మిక సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ ఏలూరులోని వసంత మహల్ సెంటర్‌లో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. రాస్తారోకోతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. నాయకులు డేగా ప్రభాకర్ (సీపీఐ), మన్నవ కృష్ణ చైతన్య (సీపీఐ), ఎ.రవి (సీపీఎం), యు.వెంకటేశ్వరరావు (సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ), రాజనాల రామ్మోహనరావు (కాంగ్రెస్), బండి వెంకటేశ్వరరావు (ఏఐటీయూసీ), డీఎన్‌వీడీ ప్రసాద్ (సీఐటీయూ), బద్దా వెంకట్రావు (ఇఫ్టూ), కె.శ్రీనివాస్ (ఏపీ రైతు సంఘం)లు మాట్లాడారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను తక్షణం ఆపాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే నిరుద్యోగ యువత ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు పోరాడుతోన్న వారిపై నిర్బంధాన్ని విడనాడాలని, ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పెదవేగి: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వర్షాలకు తడిపిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. బుధవారం పెదవేగి మండలంలోని అమ్మపాలెం, భోగాపురం, దుగ్గిరాల గ్రామాలలో సీపీఎం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పర్యటించి అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్నను పరిశీలించారు. పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడారు.

స్టే కొట్టివేతపై హర్షం

ఏలూరు (టూటౌన్): చంద్రబాబు హయాంలో అక్రమాలపై దర్యాప్తునకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రీజనల్ కోఆర్డినేటర్ డీపీ రామాంజనేయులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అమరావతి భూ కుంభకోణంతో సహా కీలక ప్రాజెక్టుల విధానాల్లో జరిగిన అవినీతిపై దర్యాప్తునకు ఉన్న ఆటంకాలు తొలగాయని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కీలక విధాన నిర్ణయాలు, అమరావతి భూ కుంభకోణం సహా భారీ ప్రాజెక్టుల్లో జరిగిన అవకతవకలపై సిట్ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఆదేశించిందని గుర్తుచేశారు. ప్రజాధనం దుర్వినియోగం, దురుద్దేశం తదితర అంశాలపై దర్యాప్తు చేస్తే తప్పేంటని సుప్రీంకోర్టు ప్రశ్నించడాన్ని స్వాగతించారు. గత ప్రభుత్వ నిర్ణయాలపై సమీక్ష జరపొద్దు అంటే వంద శాతం అక్రమాలను ప్రోత్సహించినట్టు కాదా అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం హర్షణీయమని తెలిలిపారు. ప్రాథమిక దశలోనే దర్యాప్తును అడ్డుకోవడం సమంజసం కాదన్న ఏపీ ప్రభుత్వం తరుపున న్యాయవాది వాదనలతో సుప్రీంకోర్టు ఏకీభవిస్తూ చంద్రబాబు హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై దర్యాప్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం సిట్ నియామకంపై ఏపీ హైకోర్టు ఇచ్చిన స్టేను సుప్రీంకోర్టు కొట్టి వేయడాన్ని వైఎస్సార్‌సీపీ లీగల్ పక్షాన స్వాగతిస్తున్నట్టు రామాంజనేయులు పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	72
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	42
వంకాయలు (తెలుపు)	38	ములక్కాడలు	05–07
బెండకాయలు	24	కంద	48
పచ్చిమిర్చి	42	బీట్‌రూట్	40
కాకర కాయలు	44–50	కీరా దోస	30
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	100
బీరకాయలు (పందిరి)	48	అల్లం	160
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	22	చుక్కకూర	12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణీ	--
ఆనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	16
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	16
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	05
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	14
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	05
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	--
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	32
ఏలూరు – బెంగళూరు	14.00	4021	--
ఏలూరు –తిరుపతి	16.00	4830	30

ధాన్యం వెనక్కి పంపితే కఠిన చర్యలు

మిల్లర్లను హెచ్చరించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు : ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా వెనక్కి పంపితే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే మిల్లును సీజ్ చేసేందుకు కూడా వెనుకాడబోనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హెచ్చరించారు. కొన్ని రైసు మిల్లులపై రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి తీవ్రంగా స్పందించారు. బుధవారం దెందులూరులో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రైతుకు అండగా ఉంటుందని, రైతు పండించిన ప్రతి గింజకు భరోసా కల్పించడంతో పాటు రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఏ ఒక్క రైతు అధైర్యపడవద్దని, రంగుమారిన, తడిసిన, మొలకెత్తినా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ, విజిలెన్స్ శాఖలు సమన్వయం, ప్రణాళికతో అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. అన్ని మిల్లులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. మూడు మిల్లులపై వచ్చిన ఫిర్యాదులపై ఏం చర్యలు తీసుకున్నారని దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్యను ప్రశ్నించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే అన్ని మిల్లులకు సంబంధిత గ్రామాల వీఆర్‌ఓలను కస్టోడియన్లుగా నియమించడం జరిగిందని, తానే స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నానని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. ఏ రైతుకు సమస్య వచ్చినా నాకు ఫోన్ చేయాలని నేరుగా పొలానికి, మిల్లుకు తానే వచ్చి సమస్యను పరిష్కరిస్తానన్నారు.

సత్తా ఉంటే సోము వీర్రాజు కేంద్రంతో మాట్లాడాలి

ప్రకృతి వైపరీత్యం కారణంగా వర్షాలు వస్తే రైతులకు అందరం కలిసి న్యాయం చేయాల్సింది పోయి దెందులూరు నియోజకవర్గంలో పర్యటించిన బీజేపీ నేత సోము వీర్రాజు రాజకీయం చేయడం సరికాదన్నారు. సత్తా ఉంటే కేంద్రంతో మాట్లాడి రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు సహాయసహకారాలు అందించాలన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో రైతు పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తోన్న కృషి దేశంలో ఏ రాష్ట్రంలోనూ, ఏ ముఖ్యమంత్రి చేయడం లేదన్నారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుబ్బారావు, సివిల్ సప్లయ్స్ డీఎం, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు గంటా ప్రసాదరావు, జెడ్పీ వైస్ చైర్మన్ విజయబాబు, జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, తొత్తడి వేదకుమారి, కాటి సుధాకర్, పోకల రాంబాబు, కొలుసు గణపతిరావు, కొమ్మిన రాము, బోదుల స్వరూప్, పాకలపాటి శ్రీనివాసరావు, తాళ్లూరి నాగరాజు, నిట్టా గంగరాజు, గొరిపర్తి రంగారావు తదితరులు ఉన్నారు.

దేవదాయ ధర్మదాయ శాఖ
షాపులైసెన్స్ ఫీజునకు టెండరు కమ్ బహిరంగ వేలం
ప్రకటన

ఏలూరు నగరం, కుండే సెంటర్, శ్రీలక్ష్మణస్వామి విద్యాదాన సమాజం తాలూకు పత్తేపల్లి సెంటర్‌లో గల రేకులషెడ్ షాపు డోర్ నెం.6డి-1-28(13.6x8) పొడవు వెడల్పు గల షాపును ది.17-5-2023 తేదిన ఉదయం 11గం.లకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో సమాజం కార్యాలయం నందు 3 సంవత్సరములకు వేలం పాట జరుగును. ఆసక్తి గలవారు ప్రధాన ధరావత్తుగా రూ.5000/- లు చెల్లించి పాటలో పాల్గొనవలెను. పాట అనంతరం హెచ్చుపాటదారు 1 సంవత్సరం లైసెన్స్ ఫీజు సొమ్ము అడ్వాన్స్‌గా చెల్లించవలెను. పాటలో పాల్గొనే వారు హాజరై ఉండవలెను. షరతులు వర్తిస్తాయి.

ఏలూరు 1-5-2023
సం/- : కార్యనిర్వహణాధికారి 98665 75779